అలరి ALLARI

పిక్ ఆఫ్ ద వీక్

I wish to wash my
Irish wristwatch
I wish to wash my
Irish wristwatch

వై. సహస్రగౌడ్, సిద్దిపేట.

మంచి-చెడు

కథ



శాసనపురి గ్రామంలో వీరయ్య – యశోద దంపతులు ఉండేవాళ్లు. వీరికి ఇద్దరు పిల్లలు... రాము, రాజు. వీరయ్య తమ ఊరికి దగ్గర్లో ఉన్న అడవికి వెళ్లి కట్టెలు తెచ్చి అమ్ము తుండేవాడు. వచ్చిన డబ్బుతో మద్యం తాగేవాడు. యశోద గ్రామాధికారి ఇంట్లో పనిచేస్తూ.. కుటుంబాన్ని పోషించేది. రాము కొంచెం పెద్దవాడు కావడంతో.. తల్లికి చేదోడు వాదోడుగా ఉండేందుకు తండ్రితోపాటు కట్టెలు కొట్టడానికి వెళ్లే వాడు. చిన్నవాడైన రాజు.. తల్లితోపాటు గ్రామాధికారి ఇంటికి వెళ్లేవాడు. అక్కడే చిన్నచిన్న పనులు చేస్తూ, గ్రామాధికారి కొడుకు విజయుడితో కలిసి ఆడుకునే వాడు. ఉపాధ్యాయుడు ఇంటి దగ్గరికే వచ్చి విజయుడికి చదువు చెప్పేవాడు. ఆ సమయంలో రాజు కూడా అక్కడ కూర్చునేవాడు. ఉపాధ్యాయుడు చెప్పిన అంశాలు రాజు కూడా నేర్చుకునేవాడు. రాజు ఆసక్తిని గమనించి, గ్రామాధికారి తన కుమారుడితోపాటు రాజుకు కూడా చదువుకునే ఏర్పాటుచేశాడు. తండ్రితోపాటు వెళ్లే రాము కూడా నెమ్మదిగా మద్యపానానికి అలవాటయ్యాడు. తండ్రికొడుకులు ఇద్దరూ కుటుంబాన్ని పట్టించుకోకుండా, సంపాదించిన సొమ్ము తాగడానికే ఖర్చు చేసేవారు. రాజు మాత్రం గ్రామాధికారి సహాయంతో పట్టణంలో ఉన్నత చదువులు చదువుకున్నాడు. అక్కడే అధ్యాయకుడిగా ఉద్యోగం సంపాదించాడు. మద్యపానం మానేయాలని తండ్రికి, అన్నకు ఎన్నిసార్లు చెప్పినా.. వారిలో మార్పు రాలేదు. ఒకసారి ఊరికి వచ్చిన రాజు.. గ్రామాధికారి దగ్గరికి వెళ్లి, తన తండ్రి, అన్నయ్య పరిస్థితి చెప్పి బాధపడ్డాడు. గ్రామాధికారి వారిద్దరినీ ఇంటికి పిలిపించాడు. అప్పుడు రాముతో.. ''నీ తమ్ముడు చక్కగా చదువుకొని మంచి ఉద్యోగం సాధించాడు. నువ్వు మాత్రం మద్యం తాగుతూ.. జీవితాన్ని నాశనం చేసుకుంటున్నావు. ఇప్పటికైనా మారితే మంచిది!'' అని చెప్పాడు. అప్పుడు రాము.. ''నా తండ్రిని చూసే నాకు మద్యం అలవాటైంది. నా తండ్రి తాగితే తప్పు లేనిది, నేను తాగితే తప్పేంటని అనుకునేవాణ్ణి. అందుకే తాగుడుకు బానిస అయ్యాను. నన్ను క్షమించండి'' అంటూ సంజాయిషీ ఇచ్చుకున్నాడు. తనవల్ల పెద్దకొడుకు రాము మద్యానికి బానిస అయ్యాడన్న విషయం తెలిసి.. వీరయ్య కూడా గ్రామాధికారికి క్షమాపణ చెప్పాడు. ఇకనుంచి మద్యం జోలికి వెళ్లబోమని ప్రమాణం చేశారు. దాంతో యశోద, రాజు ఎంతో సంతోషించారు.

...✍ మొర్రి గోపి

సృజన

1. సౌర కుటుంబంలో అతిపెద్ద ఉపగ్రహం ఏది?
2. 'వ్యాలీ ఆఫ్ ఫ్లవర్స్' జాతీయ ఉద్యానవనం ఏ రాష్ట్రంలో ఉంది?
3. తాగునీటిలో ఉండాల్సిన ఫ్లోరిన్ పరిమాణం ఎంత?

కింద ఇచ్చిన పదంలోని అక్షరాల సాయంతో ఎన్ని కొత్త పదాలను సృష్టించగలరో చూడండి.

computer

Ex : court

Bi_d

Bi_y_le

బొమ్మల ఆధారంగా ఖాళీలను పూరించండి.

చుక్కల ఆధారంగా బొమ్మ గీసి, రంగులు వేయండి



పెద్దల మాట

నీ అంగీకారం లేకుండా నీ ఆత్మగౌరవాన్ని ఎవ్వరూ తగ్గించలేరు.

- మహాత్మా గాంధీ.

ఖాళీలు పూరించండి: 1. bird, bicycle 2. ఖండాలు, ఖండాంతర్గతం 3. 1.5 mg/లీ

పిల్లలూ! మీరు గీసిన బొమ్మలు, రాసిన కథలు, జోక్స్ మాకు పంపండి. బాగుంటే ప్రచురిస్తాం. మా చిరునామా : zindagi@ntnews.com

పల్లెల్లో పబ్లిక్ లైబ్రరీలు

- ప్రతి పంచాయతీలో ఏర్పాటుకు శ్రీకారం
- ఖమ్మం జిల్లాలో 18 చోట్ల ప్రారంభం
- ఒక్కో లైబ్రరీకి రూ.1.50 లక్షల వ్యయం
- ఉద్యోగులు, విద్యార్థులకు ఉపయోగం
- 'పౌర పఠన మందిరం'గా నామకరణం

గంగారంలో పత్రికలు, పుస్తకాలు చదువుతున్న గ్రామస్తులు

సత్తుపల్లి, జూలై 22: గ్రామీణ ప్రజలకు గ్రంథాలయాలను అందుబాటులోకి తెచ్చేందుకు తెలంగాణ ప్రభుత్వం, జిల్లా గ్రంథాలయ సంస్థ శ్రీకారం చుట్టాయి. 'పౌర పఠన మందిరాల' పేరిట వీటిని ఏర్పాటు చేస్తున్నాయి. రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకల్లో భాగంగా ఖమ్మం జిల్లాలోని పలు పంచాయతీల్లో వీటిని ప్రారంభించాయి. పల్లె ప్రజల్లో పఠనాశక్తిని పెంచేందుకు, విద్యార్థులకు, ఉద్యోగార్థులకు ఉపయుక్తంగా ఉండేందుకు వీటి ఏర్పాటును ప్రారంభించాయి. గ్రామాల్లో నిరుపయోగంగా ఉన్న భవనాలకు మరమ్మతులు చేయించి పౌర పఠన మందిరాలుగా వినియోగిస్తున్నాయి. వీటి ఏర్పాటు కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.1.50 లక్షల నిధులు కేటాయించింది. ఈ నిధులతో అందమైన, ఆకర్షణీయమైన భవనాలుగా రూపుదిద్దుతోంది. ఇప్పటికే ఖమ్మం జిల్లాలో 18 చోట్ల వీటిని ప్రారంభించింది. వాటిల్లో ముందుగా మండలానికి రెండు గ్రామ పంచాయతీల్లో ఏర్పాటు చేయాలని భావిస్తోంది. క్రమంగా అన్ని గ్రామాలకూ విస్తరించనుంది. ఈ పౌర పఠన మందిరాల నిర్వహణకు నెలకు రూ.2 వేల కేటాయిస్తోంది. వీటిలో రూ.1000 దినపత్రికల కోసం, మరో రూ.1000 గ్రంథాలయ నిర్వాహకుడి పారితోషికం కోసం వెచ్చించనుంది. పౌర పఠన మందిరాలు నిరుద్యోగ యువతకు, పుస్తక ప్రియులకు విజ్ఞానాన్ని అందిస్తాయి. వివిధ పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే నిరుద్యోగులు కోరిన పుస్తకాలను తెప్పించి అందుబాటులో ఉంచుతారు. పుస్తక పఠనంపై ఆసక్తి ఉన్నవారు కూడా వచ్చి వివిధ పుస్తకాలు, పత్రికలు చదువుకోవచ్చు. సభ్యత్వం తీసుకున్న వారు అవసరమైన పుస్తకాలను ఇంటికి తీసుకువెళ్లడానికి కూడా వీలుంది.

పంచాయతీ ఖాతాకు నెలకు రూ.2 వేలు..

ఒక్కో పఠన మందిరానికి రూ.1.50 లక్షల నిధులు రాష్ట్ర ప్రభుత్వం ఇస్తుండగా వాటిలో రూ.90 వేలను రూము, మరమ్మతులకు, రూ.40 వేలను ఫర్నీచర్‌కు, రూ.10 వేలను పుస్తకాల కొనుగోలుకు, రూ.10 వేలను ఇతర సదుపాయాల కల్పనకు కేటాయించింది. పౌర పఠన మందిరాలను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసినప్పటికీ అనంతరం వాటి నిర్వహణ, ఇతర సదుపాయాలు వంటి వాటిని గ్రామ పంచాయతీలు సమకూర్చుకోవాల్సి ఉంటుంది. రెండు దిన పత్రికల కొనుగోలు, పౌరపఠన మందిర నిర్వహణ కోసం వెచ్చించే రూ.2 వేలను గ్రామ పంచాయతీల ఖాతాల్లో జిల్లా గ్రంథాలయ సంస్థ జమచేయనుంది. ఈ పౌర పఠన మందిరాలను అదనపు కలెక్టర్ పర్యవేక్షిస్తారు.

18 పౌర పఠన మందిరాల ఏర్పాటు...

ఖమ్మం జిల్లాలో గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో 18 పౌర పఠన మందిరాలను ఏర్పాటు చేశారు. వీటిలో బోనకల్లు మండలంలోని ముష్టికుంట్ల, లక్ష్మీపురం, చింతకాని మండలంలోని ప్రొద్దుటూరు, కొణిజర్ల మండలంలోని మల్లుపల్లి, కూసుమంచి మండలంలో గోరీలపాడుతండా, పాలేరు, మధిర మండలంలోని సిరిపురం, ముదిగొండ మండలంలోని మేడేపల్లి, పమ్మి, నేలకొండపల్లి మండలంలోని చెరువు మాధారం, పెనుబల్లి మండలంలోని అడమమల్లేల, సత్తుపల్లి మండలంలోని గంగారం, కాకర్లపల్లి, వేంసూరు మండలంలోని వేంసూరు, చౌడవరం, వైరా మండలంలోని సిరిపురం గ్రామాలు ఉన్నాయి.

పుస్తక పఠనం చేస్తున్న యువకులు

సత్తుపల్లి మండలం గంగారంలోని పౌర పఠన మందిరం

కేంద్రాలను వినియోగించుకోవాలి..

గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు, విద్యార్థులు, యువతీ యువకులు, నిరుద్యోగులకు పుస్తక పఠనం అలవాటు చేయడానికి ప్రభుత్వం పబ్లిక్ రీడింగ్ రూమ్‌లను ఏర్పాటు చేసింది. ప్రజలు వీటిని సద్వినియోగం చేసుకుని పఠనాశక్తిని పెంపొందించుకోవాలి. తెలంగాణ ప్రభుత్వం ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల చేస్తున్న క్రమంలో యువతీ యువకులు, విద్యార్థులు ఈ లైబ్రరీల్లోని పోటీ పరీక్షల పుస్తకాలను వినియోగించుకోవాలి.

-కొత్తూరు ఉమామహేశ్వరరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ వైర్మన్

కోరిన పుస్తకాలు తెప్పిస్తాం..

తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో పంచాయతీల్లో పౌర పఠన కేంద్రాలను ఏర్పాటు చేశాం. గ్రామస్తులు, యువతీ యువకులు, విద్యార్థులు, ఉద్యోగార్థులు ఈ కేంద్రాలకు వచ్చి అవసరమైన పుస్తకాలు, పత్రికలు చదువుకోవచ్చు. పాఠకులు కోరిన విధంగా పుస్తకాలు తెప్పించి అందుబాటులో ఉంచేలా చర్యలు చేపడుతున్నాం.

-మందపాటి శ్రీనివాసరెడ్డి, సర్పంచ్, గంగారం, సత్తుపల్లి మండలం

తక్షణ కర్తవ్యం పారిశుధ్యం

- భద్రాచలం వద్ద శాంతించిన గోదావరి
- పట్టణానికి తప్పిన వరద ముప్పు
- ముమ్మరంగా 'క్లీనింగ్' పనులు

భద్రాచలం టెంపుల్ పరిసర ప్రాంతంలో వర్షాల వల్ల చేరిన మురుగును శుభ్రం చేస్తున్న పారిశుధ్యకార్మికులు

భద్రాద్రి కొత్తగూడెం, జూలై 22 (నమస్తే తెలంగాణ): భద్రాచలం వద్ద గోదావరి శాంతించింది. శనివారం సాయంత్రం ప్రవాహం 40.1 అడుగులకు చేరుకున్నది. కానీ పట్టణాన్ని వరద ప్రభావం మాత్రం వదలలేదు. రాష్ట్ర రవాణాశాఖ మంత్రి అజయ్‌కుమార్ శుక్రవారం నుంచి పట్టణంలోనే మకాం వేసి భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక ఆలతో కలిసి వరద పరిస్థితులను సమీక్షిస్తున్నారు. నస్తుపునేని మోహన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పునరావాస కేంద్రంలో ఆశ్రయం పొందుతున్న ముంపు ప్రాంతవాసులకు వసతులు కల్పిస్తున్నారు. గతేడాది వానకాలంలో గోదావరి 72.3 అడుగుల వద్ద ప్రవహించి జల ప్రళయం సృష్టించిన సంగతి తెలిసిందే. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని మంత్రి అజయ్‌కుమార్ ఎప్పటికప్పుడు యంత్రాంగాన్ని అప్రమత్తం చేస్తున్నారు. వరద వచ్చి మర లిపోయిన ప్రాంతాల్లో పంచాయతీ సిబ్బంది 440 మందితో పారిశుధ్య చర్యలు చేయిస్తున్నారు. వైద్యారోగ్య శాఖ అధికారులు వైద్యశిబిరాలు నిర్వహించి ప్రజలకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నారు.

శుభ్రంగా తయారైన రహదారి

ముమ్మరంగా పారిశుధ్యం పనులు..

భద్రాచలం ముంపు ప్రాంతాల్లో ముమ్మరంగా పారిశుధ్య పర్యవేక్షణ చేపడుతున్నాం. పనులను 10 మంది ఎంపీవోలు, 40 మంది పంచాయతీ సెక్రటరీలు పర్యవేక్షిస్తున్నారు. 440 మంది పారిశుధ్య కార్మికులు రంగంలోకి దిగి వీధులను శుభ్రం చేస్తున్నారు. బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్నారు.

– రమాకాంత్, డీపీవో, కొత్తగూడెం

వరదల పట్ల అప్రమత్తంగా ఉండాలి

గోదావరి వరదలపై సమీక్షిస్తున్న మంత్రి పువ్వాడ. మహబూబాబాద్ ఎంపీ మాలోత్ కవిత

- వర్షాలు విస్తారంగా కురుస్తున్నందున వరద ప్రమాదం పొంచే ఉంది
- ముంపు ప్రభావిత ప్రాంతాల్లో నిరంతరం పారిశుధ్య కార్యక్రమాలు
- సమీక్షలో మంత్రి పువ్వాడ అజయ్, ఎంపీ మాలోత్ కవిత

భద్రాచలం/సారపాక, జూలై 22: గోదావరి వరదల పట్ల ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సూచించారు. భద్రాచలానికి వరద ముప్పు ఇంకా తొలగిపోలేదని, మరో మూడు రోజుల పాటు వర్షాలు విస్తారంగా కురిసే అవకాశం ఉన్నందున వరద భయం పొంచి ఉందని అన్నారు. గోదావరి వరదల నేపథ్యంలో సారపాకలోని ఐటీసీ గెస్ట్‌హౌస్‌లో మహబూబాబాద్ ఎంపీ మాలోత్ కవితతో కలిసి ప్రత్యేక అధికారులు, జిల్లా అధికారులతో శనివారం నిర్వహించిన ప్రత్యేక సమీక్ష సమావేశంలో మంత్రి మాట్లాడారు. వరదలు సాధారణ స్థాయికి వచ్చేంత వరకు తాను భద్రాచలంలోనే ఉంటానని అన్నారు. వరద పరిస్థితిని సీఎం కేసీఆర్ ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నారని, ఎంత వరద ముప్పు వచ్చినా ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలను కూడా రంగంలోకి దించామని, సింగరేణి, కేటీపీఎస్, నవభారత్ రెస్క్యూ టీంలు కూడా సిద్ధంగా ఉన్నాయని వివరించారు. ముఖ్యంగా ముంపు ప్రభావిత ప్రాంతాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని అక్కడ నిరంతరం పారిశుధ్య పనులు చేపట్టాలని సూచించారు. అలాగే వైద్యారోగ్య శాఖాధికారులు కూడా వరద ముంపు ప్రాంతాల్లో పర్యటిస్తూ ఎవరికైనా అనారోగ్యం కలిగితే వెంటనే వైద్య చికిత్స అందించాలని సూచించారు. పునరావాస కేంద్రాల్లో కూడా అత్యవసర మందులను అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. అనంతరం ఎంపీ మాలోత్ కవిత మాట్లాడుతూ.. వరద ఉధృతి గతంలో కంటే తక్కువగానే ఉన్నప్పటికీ అధికారులు అలసత్వం వహించవద్దని సూచించారు. ఏమాత్రం వరద పెరిగినా ముంపు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలని సూచించారు. పునరావాస కేంద్రాల్లో విద్యుత్, తాగునీరు తదితర అన్ని రకాల సౌకర్యాలు కల్పించడంతో పాటు రుచికరమైన ఆహారం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈ సమీక్షలో ప్రత్యేకాధికారులు అనుదీప్ దురిశెట్టి, గౌతమ్ పొట్రు, భద్రాద్రి కలెక్టర్ డాక్టర్ ప్రియాంక, ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్, ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్పీ వినీత్ పాల్గొన్నారు.

ముంపు ప్రాంత ప్రజలు అధైర్య పడొద్దు

- వారికి బీఆర్ఎస్ ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుంది
- భద్రాచలంలో గోదావరి ఉధృతి పరిశీలనలో ఎంపీ కవిత

భద్రాచలం బ్రిడ్జిపై నుంచి పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావుతో కలిసి గోదావరి ఉధృతిని పరిశీలిస్తున్న ఎంపీ మాలోత్ కవిత

భద్రాచలం, జూలై 22: భద్రాచలం వద్ద గోదావరి ఉధృతిని మహబూబాబాద్ ఎంపీ మాలోత్ కవిత శనివారం పరిశీలించారు. రెండు రోజులుగా గోదావరి ప్రవాహం మొదటి ప్రమాద హెచ్చరికను దాటి ప్రవహించి శుక్రవారం మధ్యాహ్నం నుంచి తగ్గుతూ వచ్చింది. శనివారం ఉదయం 39.4 అడుగులుగా ఉన్న వరద మధ్యాహ్నం 3 గంటలకు మూడు అంగుళాలు పెరిగి 39.7 అడుగులకు చేరింది. శనివారం భద్రాచలానికి చేరుకున్న మహబూబాబాద్ ఎంపీ మాలోత్ కవిత.. ప్రభుత్వ విప్ రేగా కాంతారావుతో కలిసి గోదావరి బ్రిడ్జిపై నుంచి వరద ఉధృతిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వరదల పట్ల ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముంపు ప్రాంతాల ప్రజలకు బీఆర్ఎస్ ప్రభుత్వం అండగా ఉంటుందని స్పష్టం చేశారు. వరద పరిస్థితిపై సీఎం కేసీఆర్ ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారని, రాష్ట్ర రవాణా శాఖా మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌తో నిత్యం ఫోన్‌లో మాట్లాడుతూ వరద పరిస్థితిని తెలుసుకుంటున్నారని చెప్పారు. వరద తగ్గే వరకు భద్రాచలంలోనే ఉండి పరిస్థితులను సమీక్షించాలని మంత్రి అజయ్‌కుమార్‌ను ఆదేశించారని అన్నారు. గోదావరి పరీవాహక ప్రాంతాలైన భద్రాచలం, ములుగు జిల్లాలోని ముంపు బాధితులెవరూ అధైర్య పడవద్దని సూచించారు. పునరావాస కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించామని అన్నారు.

భద్రాద్రి జిల్లాలో 37 మంది ఎస్సైలకు బదిలీ

కొత్తగూడెం క్రైం, జూలై 22: భద్రాద్రి జిల్లావ్యాప్తంగా 37 మంది ఎస్సైలను బదిలీ చేస్తూ శనివారం మల్టీజోన్-1 ఐజీ ఎస్. చంద్రశేఖర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. మణుగూరు ఎస్సై రాజ్‌కుమార్‌ను బూర్గంపహాడ్ పీఎస్ ఎస్‌హెచ్‌వోగా, బూర్గంపాడు ఎస్‌హెచ్‌వో సంతోశ్‌ను లక్ష్మీదేవిపల్లి ఎస్‌హెచ్‌వోగా, పాల్వంచ టౌన్ పీఎస్ ఎస్‌హెచ్‌వో కె.నరేశ్‌కుమార్‌ను కొత్తగూడెం ట్రాఫిక్ పీఎస్ ఎస్‌హెచ్‌వోగా, పాల్వంచ రూరల్ పీఎస్ ఎస్‌హెచ్‌వో ఎం.శ్రీనివాస్‌ను భద్రాచలం ట్రాఫిక్ పీఎస్ ఎస్‌హెచ్‌వోగా, పాల్వంచ టౌన్ పీఎస్ ఎస్సై-2 జి.ప్రవీణ్ కుమార్‌ను చుంచుపల్లి పీఎస్ ఎస్‌హెచ్‌వోగా, లక్ష్మీదేవిపల్లి పీఎస్ ఎస్‌హెచ్‌వో జి.ప్రవీణ్‌ను కొత్తగూడెం సీసీఎస్ ఎస్సైగా, చుంచుపల్లి పీఎస్ ఎస్‌హెచ్‌వో కె.సుమన్‌ను కొత్తగూడెం సీసీఎస్ ఎస్సైగా, ఎస్సీ పరిధిలో వీఆర్ ఎస్సై శ్రీరాములు శ్రీనును మణుగూరు ఎస్సై-1గా, బూర్గంపాడు ఎస్సై బి.శ్రీనివాస్‌ను కొత్తగూడెం వన్ టౌన్ ఎస్సై-1గా, సుజాతనగర్ ఎస్‌హెచ్‌వో పండగ తిరుపతిరావును అశ్వాపురం పీఎస్ ఎస్సై-2గా, మణుగూరు ఎస్సై బి.పురుషోత్తాన్ను జూలూరుపాడు పీఎస్ ఎస్‌హెచ్‌వోగా, కొత్తగూడెం ఏఎస్ఎస్ ఎస్సై పి.శ్రీకాంత్‌ను అశ్వారావుపేట ఎస్‌హెచ్‌వోగా, అశ్వారావుపేట ఎస్‌హెచ్‌వో బి.రాజేశ్‌కుమార్‌ను మణుగూరు ఎస్సై-2గా, దుమ్ముగూడెం ఎస్సై ఎం.రవికుమార్‌ను దమ్మపేట ఎస్‌హెచ్‌వోగా, కొత్తగూడెం వీఆర్ ఎస్సై ఇ.నాగభిక్షాన్ను బూర్గంపాడు ఎస్సై-2గా, ఐటీ కోర్ ఎస్సై జి.కార్తీక్‌ను పాల్వంచ రూరల్ ఎస్‌హెచ్‌వోగా, కొత్తగూడెం వన్ టౌన్‌లో ఎస్సై రెడ్డెం నర్సిరెడ్డిని దుమ్ముగూడెం ఎస్సై-1గా, జూలూరుపాడు ఎస్‌హెచ్‌వో పి.గణేశ్‌ను సీసీఎస్ ఎస్సైగా, కరక గూడెం ఎస్సై ఐ.జీవన్‌రాజును కొత్తగూడెం త్రీ టౌన్ ఎస్సై-1గా, కొత్తగూడెం త్రీ టౌన్ ఎస్సై ముత్తినేని సోమేశ్వరను సుజాతనగర్ ఎస్‌హెచ్‌వోగా, కొమురారం ఎస్‌హెచ్‌వో పి.శివరామకృష్ణను అశ్వారావుపేట ఎస్సై-2గా, భద్రాచలం ట్రాఫిక్ ఎస్సై ఎస్‌కే షాహిద్ పి.పి.ఎన్.రావును భద్రాచలం టౌన్ పీఎస్ ఎస్సై-2గా, చంద్రుగొండ పీఎస్ ఎస్‌హెచ్‌వో జి.విజయలక్ష్మిని ఇల్లెందు పీఎస్ ఎస్సై-2గా, కొత్తగూడెం వీఆర్ ఎస్సై డి.విజయకుమారిని కొత్తగూడెం త్రీ టౌన్ పీఎస్ ఎస్సైగా, కొత్తగూడెం వన్ టౌన్ ఎస్సై జి.విజయను భద్రాచలం టౌన్ పీఎస్ ఎస్సైగా, భద్రాచలం ఎస్సై ఎం.శ్రావణ్ కుమార్‌ను కొత్తగూడెం వీఆర్‌కు, కరకగూడెం పీఎస్ ఆటాచ్‌మెంట్ ఎస్సై ఎన్.రాజారామ్‌ను ఇదే పీఎస్ ఎస్‌హెచ్‌వోగా, కొత్తగూడెం ట్రాఫిక్ ఆటాచ్‌మెంట్ ఎస్సై వాసికర్ల శ్రీనివాసరావును కొత్తగూడెం పీసీఆర్ ఎస్సైగా, కొత్తగూడెం టూ టౌన్ ఆటాచ్‌మెంట్ ఎస్సై బి.శ్రీనివాసరావును కొత్తగూడెం పీసీఆర్ ఎస్సైగా, జిల్లా ఆటాచ్‌మెంట్ ఎస్సై మానిసేని రవిని చండ్రుగొండ ఎస్‌హెచ్‌వోగా, జిల్లా ఆటాచ్‌మెంట్ ఎస్సై బాణాల రామును పాల్వంచ టౌన్ ఎస్‌హెచ్‌వోగా, జిల్లా ఆటాచ్‌మెంట్ ఎస్సై గంజి స్వప్నను కొత్తగూడెం వీఆర్‌కు, జిల్లా ఆటాచ్‌మెంట్ ఎస్సై బి.గిరిధర్‌రెడ్డిని కొమురారం పీఎస్ ఎస్‌హెచ్‌వోగా, జిల్లా ఆటాచ్‌మెంట్ ఎస్సై సోమ సతీశ్‌కుమార్‌ను ఇల్లెందు ఎస్సై-1గా, జిల్లా ఆటాచ్‌మెంట్ ఎస్సై డి.రాఘవయ్యను పాల్వంచ టౌన్ ఎస్సై-2గా, ఇల్లెందు ఎస్సై సీహెచ్ చంద్రశేఖర్‌ను జిల్లా సీసీఎస్ ఎస్సైగా, అశ్వారావుపేట ఎస్సై-2 ఎస్.కె. రఫీని జిల్లా సీసీఎస్ ఎస్సైగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.